క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్

బేతంచెర్ల: పట్టణంలో గురువారం డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగా లేని, రోడ్డు ట్యాక్స్ చెల్లించని, డ్రైవింగ్ లెసెన్సులేని, బీమా చెల్లించని, అధిక లోడుతో వెళ్తున్న 12 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 3.50 లక్షల జరిమానా విధించారు. వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

విద్యార్థులకు ఉచిత ఆధార్‌సేవలు



ఆధార్‌క్యాంపును పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటసుబ్బయ్య

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత ఆధార్ సేవలందిస్తున్నట్లు ఎంఈఓ వెంకటసుబ్బయ్య, హెచ్‌ఎం రాజయ్య తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఆధార్ సేవలకోసం గ్రామ సచివాలయాలు, ఆధార్‌సెంటర్లు తిరగకుండా పాఠశాలలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వరప్రసాదరావును కోరామన్నారు. ఎంపీడీఓ ప్రత్యేక చొరవతో పాఠశాలలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారన్నారు.

పశుగణనకు సహకరించండి

కొలిమిగుండ్ల: మండలంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని యజమానులు సహకరించాలని పశువైద్యాధికారిణి పద్మావతి కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్ల కొకసారి పశుగణన నిర్వహిస్తుందన్నారు. పశుగణనలో భాగంగా గ్రామ గ్రామానా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు గణాంకాలు సేకరిస్తారని చెప్పారు. ఆవులు, గేదేలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు ఇలా అన్ని రకాల మూగజీవాల లెక్కింపు జరుగుతుందన్నారు. పశుగణన 2025 ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని చెప్పారు.

ఘనంగా ఐక్యరాజ్య సమితి దినోత్సవం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితిలో ముఖ్య విభాగమైన భద్రతామండలిలో భారత దేశానికి శాశ్వత సభ్యత్వ హోదా తప్పనిసరిగా రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణ శశాంక్, కృష్ణదాసు, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెరువుపల్లెలో గ్రామ సభ

బనగానపల్లె రూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఈ గ్రామసభలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రజలను నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ఆంజనేయులు మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ఆంజనేయులు(65) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ డైరక్టర్ బాబుల్ రెడ్డి, ఎంపీటీసీ రామనాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు రుద్రవరం నారాయణ, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, పుల్లయ్య తదితరులు ఆంజనేయులు మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిత్యం జల గండమే!

- ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాల్వల్లో తరచూ ప్రమాదాలు
- కాల్వల్లో తేలుతున్న శవాలు
- నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్న పరివాహక ప్రాంతాల ప్రజలు



కాలువలో కొట్టుకుపోతున్న గేదెలు (ఫైల్)



నిండుకుండలా జీఎన్‌ఎస్ కాల్వ



ఎస్‌ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం

బనగానపల్లె: ఎస్‌ఆర్‌బీసీ, జీఎన్‌ఎస్‌ఎస్ (గాలేరు–నగరి సుజల ప్రవంతి) ప్రధాన కాల్వలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఈమధ్య కాలంలో తరచూ ఏదోఒక చోట ప్రమాదం చోటుచేసుకుంటుండగా, కొందరు ఉద్దేశ పూర్వకంగా కాలువలో దూకి మృతిచెందుతున్నారు. కాలువ వెంట ఎస్‌ఆర్‌బీసీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాలని పరివాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉధృతంగా నీటి ప్రవాహం

పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బనగానపల్లె మీదుగా అవుకు రిజర్వాయర్‌కు వెళ్లే జీఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన కాల్వలో 10–15వేల క్యూసెక్కులు, ఎస్‌ఆర్‌బీసీ కాల్వ ద్వారా 1500–2000 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉంది. ఈ కాల్వల పలు గ్రామాల మీదుగా వెళ్తుంది. అయితే ఇటీవల కాలువ వద్దకు నీరు తాగేందుకు కని, చేతులు కడుక్కునేందుకని వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాగా, కొందరు ఉద్దేశపూర్వకంగానే కాల్వలో దూకి ప్రణాలు వదులుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాలు..

- మండలంలోని యాగంటిపల్లె వద్ద ఇటీవల ప్రమాదశాత్తు జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వలో పడి 11 ఏళ్ల బాలుడు మృతి చెందారు.
- నాలుగు రోజుల క్రితం పాణ్యం సమీపంలో వెన్నెల 20 అనే సంవత్సరాల యువతి ప్రమాదశాత్తు ఎస్‌ఆర్‌బీసీ కాల్వలో పడగా బనగానపల్లె సమీపంలో రవ్వలకొండ సమీపంలో శవమై తేలగా పోలీసులు వెలికి తీశారు.
- ఈ నెల 23న తమ్మడపల్లి ఎస్‌ఆర్‌బీసీ సబ్ కెనల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. అలాగే పాణ్యం మండలం సుగాలి మెట్ట వద్ద జీఎన్‌ఎస్‌ఎస్ కాలువలో నీళ్లు తాగేందుకు వెళ్లి 22 గేదెలు ప్రమాదవశాత్తు కొట్టుకుపోగా.. అందులో పదింటిని రైతులు రక్షించారు. మిగితావి కొట్టుకుపోయాయి.

ఇవి ఇటీవల వెలుగులోకి వచ్చినవి మాత్రమే.. ఇటువంటి ఘటనలు కోకోల్లలు. చాల గ్రామాల వద్ద అక్కడి ప్రజలు కాల్వలోనికి దిగేందుకు అధికారులు మెట్లను ఏర్పాటు చేశారు. అయితే రక్షణ చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా ఎస్‌ఆర్‌బీసీ, పోలీసు అధికారులు అవసరమైన ప్రాంతాల్లో ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కాల్వల వెంట నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అయోడిన్ ఉప్పును వినియోగించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జమీలా

బనగానపల్లె: అయోడిన్ ఉప్పును వినియోగించడం వల్ల థైరాయిడ్ సమస్యను అధిక మించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జమీలా అన్నారు. గురువారం మండలంలోని పలుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అయోడిన్ లోపం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. థైరాయిడ్ వ్యాధి రాకుండా ఎలాంటి చర్యలు, ఆహారం తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

డోన్ ఆర్డీఓగా నరసింహులు

డోన్ టౌన్: డోన్ ఆర్డీఓగా తిరుపతి వీసీవీసీ డిప్యూటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కేపీ నరసింహులును నియమిస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహేశ్వరరెడ్డిని బదిలీ చేస్తూ తుదపరి పోస్టింగ్ కోసం ప్రభుత్వ కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: హుసేనాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం హుసేనాపురం, చంద్రపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పైన సూచించిన గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నందవరం గ్రామాన్ని సందర్శించిన డీపీఓ



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీపీఓ జమీవుల్లా

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామాన్ని జిల్లా పంచాయతీ ఆఫీసర్ (డీపీఓ)జమీవుల్లా గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి గ్రామంలో పలు సమస్యలు పరిష్కారం కావడంలేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామంలో ఆక్రమణలు తొలగించాలని, మౌలిక వసతులు లేవని ఇంకా పలువురు అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. డీపీఓ జమీవుల్లా ఫిర్యాదుదారుడిని కలిసి ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ సచివాయాన్ని సందర్శించి, అక్కడే ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జీ ఈఓఆర్‌డీ సతీష్ కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



విద్యార్థులకు ప్రశాంస పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యశించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సయ్యద్ సలీం బాషా సూచించారు. మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూలులో గురువారం క్రమ శిక్షణతో కూడిన విద్యపై పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు యువజన సర్వీసుల శాఖ సెట్కూర్– కర్నూలు ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి దూరంగా ఉండేందుకు పాటించాల్సిన పద్ధతులను సయ్యద్ సలీం బాషా వివరించారు. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ మరియదాసు, ఉపాధ్యాయులు ఫక్రుద్దీన్ అలి అహ్మద్, చిన్న లింగమ్మ, తస్లీమ్ ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలి



కోటపేట వీధిలో పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని నంద్యాల జిల్లా సహాయ మలేరియా అధికారి వర ప్రసాద్ రెడ్డి సూచించారు. పట్టణంలోని కోటపేట వీధిలో చిన్నారి ధార్వేస్‌కు బుధవారం డెంగీ నిర్ధారణ కావడంతో గురువారం ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే పాటించాలన్నారు. దోమల వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు తదితర వ్యాధులు సోకుతాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాఆలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యురాలు ప్రియాంక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి



ప్యాపిలి బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి తంగమణి

ప్యాపిలి: పట్టణంలోని బాలుర వసతిగృహం, రాచర్ల వసతి గృహాన్ని డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని స్టోర్‌రూం, గదులను పరిశీలించారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు, స్నానపు గదుల సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని హాస్టల్ సిబ్బందిని జడ్జి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, క్రమం తప్పకుండా వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా ప్రతిరోజూ వారికి నైతిక విలువలు బోధించాలని సూచించారు.

వృద్ధులను ఆదరించాలి

డోన్ టౌన్ : ప్రతి ఒక్కరికీ వృద్ధాప్యం తప్పనిసరి అని, వృద్ధులను ప్రతిఒక్కరూ ఆదరించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి పేర్కొన్నారు. మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపాన జాతీయ రహదారిపై పక్కన ఉన్న శ్రీకాశిరెడ్డి నాయన దేవాయం వృద్ధాశ్రమాన్ని న్యాయమూర్తి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను జడ్జి ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో వసతులు, భోజన సదుపాయాలు, వైద్య సేవలు తదితర వివరాలపై ఆరా తీశారు. వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులకు జడ్జి సూచించారు. జడ్జి వెంట కోర్టు సిబ్బంది ఇందిర, రూరల్ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ నాగేషు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పశుగణన



గొర్రెకు నట్టల నివారణ ద్రావకాన్ని తాపుతున్న జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ గోవిందునాయక్

డోన్ : ఈనెల 23వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అఖిలభారత 21వ పశుగణన కార్యక్రమం నిర్వహిస్తామని నంద్యాల జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ గోవిందునాయక్ తెలిపారు. మండలంలోని గోసానిపల్లె, చింతలపేట గ్రామాలలో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ కోసం ఉచితంగా ద్రావకాన్ని తాపించే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డోన్ పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు నాగరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. పశువులు, జీవాల వివరాలపై ఆరా తీశారు. నట్టల నివారణ మందు తాపించడం వల్ల జీవాల పొట్టలో ఉండే అంతర్ పరాన్నజీవులైన ఏలికపాములు, బద్దె పురుగులు, పొట్ట జలగలు, కార్జపు జలగలు నశించి గొర్రెలు, పొటేళ్లు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

పశుగణనకు సహకరించండి

బేతంచెర్ల: మండలంలో ఈనెల 25వ తేది నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అఖిల భారత పశు గణన చేపట్టడం జరుగుతుందని వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి తెలిపారు. సర్వే చేసేందుకు 13 మంది పశు గణాంక కార్యకర్తలు, నలుగురు వైద్యులను నియమించడం జరుగుతుందన్నారు. పశు గణన చేసిన ఇంటికి స్టిక్కర్ అతికిస్తారని, ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు.



తెల్లటి కవర్లను సద్ద కంకులకు కట్టిన దృశ్యం

కంకులకు కవర్ల రక్ష

డోన్ టౌన్ : రైతన్నలకు సాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాభావ పరిస్థితుల మూలంగా తీవ్రంగా నష్టపోతున్న రైతులకు అరకొర పంటను పశు, పక్షాధుల నుంచి కాపాడుకునేందుకు తిప్పలు తప్పడం లేదు. కీటకాల దాడులు నుంచి రక్షించుకోవడానికి కొందరు రైతులు చేను చుట్టూ చీర కడుతుండగా మరికొందరు కంచెలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ మధ్యకాలంలో కూరగాయల వ్యాపారులు వినియోగించే మైక్ సెట్‌ను పంటలను రక్షించుకునేందుకు ఉపయోగిస్తున్నారు. అయితే వినూత్నంగా హోటల్ నిర్వాహకులు పార్సిల్స్ ఉపయోగించే కవర్లు (వెండి కలర్‌లో మెరిసేవి) పంటను కాపాడుకేనేందుకు ఉపయోగిస్తున్నారు రైతులు. సద్ద, జొన్న కంకులకు ఆ కవర్లు కడుతున్నారు. గాలి వీచినప్పుడు ఈ కవర్లు కదిలే అలికిడికి పిట్టలు, పక్షులు బెదిరి పోతున్నాయి. ఇలా పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు.

అధైర్యపడొద్దు.. .. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ మంత్రి బుగ్గన భరోసా



గుండాల గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

డోన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయినంత మాత్రాన నాయకులు, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అన్నివిధాలుగా అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. డోన్ మండలం గుండాల గ్రామ పర్యటనకు గురువారం విచ్చేసిన సందర్భంగా బుగ్గనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కల్యాణ మండపం ఆవరణలో ఆయన వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడారు. స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ చిన్న సమస్య, ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని తనతో పాటు యావత్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమ తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయిన విషయాన్ని బుగ్గన దృష్టికి తీసుకువచ్చారు. రాజకీయ విబేధాలు, కక్షలను ఎగదోయకుండా ఆయా గ్రామాల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన టీడీపీ పాలకులకు సూచించారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర, ఓబులాపురం సర్పంచ్ రమణ, కొత్తకోట ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, నాయకులు యాపదిన్నె నరసింహారెడ్డి, రామిరెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి, చనుగొండ్ల కేశవరామయ్య, తపాల మద్దిలేటి, తిరునాంపల్లె తిరుమలరెడ్డి, గుండాల వెంకటయ్య, కేశవులు, లచ్చన్న, కోట్రాయి వెంకటేశ్వరరెడ్డి, ఆది నారాయణరెడ్డి, నక్కవాగుల పల్లె భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, కొత్తకోట రాఘవరెడ్డి, ఎద్దుపెంట క్రిష్ణారెడ్డి, ఓబులాపురం మదన్ యాదవ్ తదితరులు ఉన్నారు.



క్వాలిటీ బాషా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

క్వాలిటీ బాషా కుటుంబానికి పరామర్శ

డోన్ టౌన్ : ఇటీవల మృతి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ క్వాలిటీ బాషా కుటుంబ సభ్యులను గురువారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. మృతుడి ఇంటికి వెళ్లి ఆయన సతీమణినితోపాటు కుమారుడు క్వాలిటీ అబ్దుల్లాతో బుగ్గన మాట్లాడారు. అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేడు మార్నింగ్ వాక్ : పట్టణంలోని కొత్త మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని వాకింగ్ ట్రాక్‌లో శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉదయం 6.30 గంటలకు బుగ్గన మార్నింగ్‌వాక్ చేపడుతారని, నాయకులు, కార్యకర్త లు,అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు మాజీ మంత్రి బుగ్గన రాక

ప్యాపిలి: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ప్యాపిలి మండలానికి రానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని రామరత్నగిరి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డీఓ మహేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: గ్రామాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రీ–సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డోన్ ఆర్‌డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని బిజనవేములలో గురువారం జరిగిన గ్రామసభను ఆర్‌డీఓ తనిఖీ చేశారు. గ్రామసభలో రైతుల నుంచి ఎలాంటి దరఖాస్తులు అందాయని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో ఆన్‌లైన్‌లో భూములకు సంబంధించిన వన్‌బీలు రావడం లేదని, మీ భూమి పోర్టల్‌లో మాత్రం ఆ సర్వే నంబర్‌లో ఎంత మంది ఉన్నారో చూపుతోందని రైతులు అధికారుల దృష్టికి తెచ్చారు. గ్రామంలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 30 దరఖాస్తులు అందాయి. కార్యక్రమలో మండల సర్వేయర్ వీరన్న, వీఆర్‌ఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

బనగానపల్లె రూరల్ : గతంలో భూ రీసర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారానికే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని బత్తులూరుపాడు గ్రామంలో రీ సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభ నిర్వహించారు. సభలో మొత్తం 58 మంది రైతులు తమ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రఘువేంద్ర, మండల సర్వేయర్ గీతాభవాని, వీఆర్‌ఓలు ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్, అబ్దుల్లా పాల్గొన్నారు.

సంజామల: మండల పరిధిలోని మంగపల్లి గ్రామంలో గురువారం తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ తులసి కృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హరి, ఆర్‌ఐ వెంగల్ రెడ్డి పాల్గొన్నారు.

గనుల్లో భద్రతా నియమాలు పాటించాలి



మైనింగ్ నమూనాను పరిశీలిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మైన్స్‌లో కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా భద్రతా నియమాలు పాటించాలని హైదరాబాద్‌కు చెందిన డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ జ్ఞానేశ్వర్ సూచించారు. 39వ గనుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్‌కు చెందిన సున్నపురాయి గనులను గురువారం ఆయన పరిశీలించారు. రామ్‌కో సిమెంట్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు కంపెనీ రోజు వారీ కార్యకలాపాల్లో చేపడుతున్న భద్రత చర్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో మైన్స్ సేఫ్టీ ఆడిట్ టీం సభ్యులు సైదులు, వినోద్ కుమార్, యు.వి.రావు, ప్రసాద్, కేశవరెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

డోన్ రూరల్ : ప్యాపిలి మండలంలోని ఎస్.రాచర్ల గ్రామం, సీతమ్మతండాలో ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు చేశారు. సారా బట్టీలను ధ్వంసం చేయడంతోపాటు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం డోన్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం దాడులకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. సీతమ్మతండా గ్రామంలో నాటు సారా బట్టీలతోపాటు 2,100బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే రాచర్ల గ్రామంలో దారం మధుసూదన్‌రెడ్డి నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మినారాయణ, కానిస్టేబుల్స్ ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి గురువారం తెలిపారు. కొండల్లో తవిసికొండ లక్ష్మీదేవి నాటుసారాబట్టీతో పాటు 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. లక్ష్మీదేవి అరెస్టు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు

అవుకు: నాటుసారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే శిక్షార్హులవుతారని నంద్యాల జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాముడు హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అవుకు మండలంలోని కొండమీది గ్రామాల్లో గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. పిక్కళ్లపల్లితండా, కొండమనాయునిపల్లె గ్రామాల్లో ఊరికి దూరంగా కొండల్లో 8 సారా తయారీ బట్టీలను ధ్వంసం చేసి, 10వేల లీటర్ల బెల్లంఊటను పారబోశారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని కాల్చేశారు. అలాగే బెల్లం ఊట దాచిన డ్రమ్ములను, క్యాన్లను, బిందెలను స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గ్రామస్తులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సారా తయారీని మానుకోవాలని సూచించారు. ఇకనుంచి ఎప్పుడైనా దాడులు జరుగవచ్చని హెచ్చరించారు. కార్యక్రమంలో నంద్యాల డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ దాస్, కోవెలకుంట్ల, బనగానపల్లె ఎక్సైజ్ ఎస్‌ఐలు ప్రవీణ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.